
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 3, జనవరి, 2024



సోమశిలలో 33.643 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 33.643 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 19 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.65,530
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,885
3 శాతం జీఎస్టీతో.. -	రూ.6,061
నవర (8 గ్రా) -	రూ.48,488

గరిష్టం/కనిష్టం
29.4 /22.2

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 53 శాతం ఉంది. ఉష్ణోగ్రత తక్కువగానే ఉంటోంది. బుధవారం మార్పులేవీ ఉండకపోవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

వన్‌స్టాప్ సెంటర్ ఉద్యోగుల జీతాల విడుదల

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్ర ప్రభుత్వం సఖి వన్‌స్టాప్ సెంటర్ ఉద్యోగుల జీతాలను విడుదల చేసినట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి హేనాసుజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సఖి సెంటర్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన జీతాల నగదు రూ.53,19,366 మంజూరయ్యాయని తెలిపారు. ఫేజ్–1లో రూ.8,39,900, ఫేజ్–2లో రూ.11,19,868, ఫేజ్–3లో రూ.27,14,926, ఫేజ్–4లో రూ.6,44,672 నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. జీతాలు విడుదల కావడంతో సఖీ సెంటర్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

చెత్త తరలింపు వాహనాలను అడ్డుకోవద్దు

• కమిషనర్ వికాస్‌మర్మత్



పొగతోటలో చెత్త తరలింపు ప్రక్రియపై సూచనలిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రైవేట్ వాహనాలతో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపడుతున్నామని, చెత్త తరలింపు వాహనాలను కార్మికులు దయచేసి అడ్డుకోవద్దని కమిషనర్ వికాస్‌మర్మత్ అన్నారు. స్థానిక పొగతోట, బృందావనం, ట్రంక్‌రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పోలీసు విభాగం, నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికులు శాంతియుతంగా సమ్మెను నిర్వహించుకోవాలని, చెత్త తరలింపు ప్రైవేట్ వాహనాలను అడ్డుకోవడం, రాకపోకలకు ఆటంకం కలిగించడం సరైన విధానం కాదన్నారు. వీధుల్లో వ్యర్థాలు పేరుకోవడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, నగర ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైతే కఠిన చర్యలు కూడా తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు కూడా వ్యర్థాలను వీధుల్లో, రోడ్లపై బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని సూచించారు.

రేషన్ సరఫరా సక్రమంగా జరగాలి

• జేసీ కూర్మనాథ్



అధికారులతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

ఆత్మకూరు: ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకుల పంపిణీ డివిజన్ పరిధిలో లబ్ధిదారులందరికీ సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయన మంగళవారం ఆర్డీఓ కురబ మధులత, సివిల్ సప్లయ్స్ డీటీలతో మాట్లాడారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి తప్పనిసరిగా రేషన్ సరుకులు లబ్ధిదారులకు ఇచ్చేలా చూడాలన్నారు. ఈ నెల 1వ తేదీన 8 ఎండీయూ వాహనాలు సరుకులు ఇచ్చేందుకు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లని విషయం తన దృష్టికి వచ్చిందని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 10 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షకు పది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. 67 మంది విద్యార్థులకు గానూ 57 మంది హాజరయ్యారని వెల్లడించారు.

పండుగుల్ల పొగాకు విక్రయిస్తే చర్యలు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో వర్జీనియా పొగాకు, పండుగుల్ల విక్రయించినా, కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగుల్ల అమ్మకాలు పొగాకు కేంద్రాల్లో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. రైతుల వద్దనున్న పండుగుల్ల పొగాకును ఎవరికీ విక్రయించొద్దన్నారు.

అవినీతి జలగలు



కొందరు పేరుకే ప్రభుత్వ ఉద్యోగులు. అడిగినంత లంచం ఇవ్వకపోతే పనిచేయకపోగా కాళ్లరిగేలా తిప్పుకుంటారు. అవినీతి జలగల్లె పట్టి పీడిస్తారు. లంచం ఇస్తేనే పనిచేస్తారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని కొందరు ఏసీబీని ఆశ్రయిస్తుండడంతో కొందరు అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కి కటకటాల పాలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అవినీతి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించి వారి భరతం పడుతోంది.

• రూ.లక్షల్లో జీతాలు.. అయినా కక్కుర్తే
• లంచం ఇవ్వనిదే ఫైల్ కదలదు
• అదనపు ఆదాయం కోసం అడ్డదారులు
• అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు



జలదంకి ట్రాన్స్‌కో కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వారిని విచారిస్తున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు

ఉదయగిరి: కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు రూ.లక్షల్లో, రూ.వేలల్లో జీతం తీసుకుంటున్నా అదనపు ఆదాయం కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. అడిగిన లంచం ఇవ్వకపోతే కార్యార్థులను నెలల తరబడి తమ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. దీంతో కార్యార్థులు విసుగు చెంది అడిగినంత ఇచ్చుకుని తమ పనులను చేయించుకుంటున్నారు. లంచం ఇవ్వకపోతే సవాలక్ష సాకులు చూపి నరకం చూపిస్తున్నారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని కొందరు మాత్రం ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తుండడం గమనార్హం. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అవినీతి అధికారుల భరతం పట్టేందుకు అనేక చర్యలు చేపట్టింది. ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు అవినీతి నిర్మూలనపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. దీంతో పలువురు ముందుకువచ్చి అవినీతి జలగలను ఏసీబీ అధికారులకు పట్టిస్తున్నారు.

లంచం ఇవ్వకపోతే..

లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు మంగళవారం చిక్కిన జలదంకి ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ చంద్రశేఖర్ లంచం తీసుకోనిదే పనిచేయడనే ఆరోపణలు ఉన్నాయి. కావలి మండలంలో సబ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తూ ఏడాదిన్నర నుంచి జలదంకి మండలానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి కొంతమంది ఎంపిక చేసుకున్న దిగువస్థాయి సిబ్బంది ద్వారా వసూలు చేసేవారు. ఇతని వ్యవహారశైలిపై ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా పలుమార్లు హెచ్చరించినా ఆయన తీరులో మార్పులేదని తెలుస్తోంది. అందరికీ అన్నం పెట్టే రైతన్నల నుంచి కూడా ముక్కుపిండి వసూలు చేసేవారనే ఆరోపణలు ఉన్నాయి. ఇతనితోపాటు జిల్లాలో అనేక మండలాల్లో విధులు నిర్వహిస్తున్న కొందరు ఏఈలు లంచం ఇవ్వనిదే పనులు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వారి నెల జీతం కన్నా లంచాల ద్వారా వచ్చే ఆదాయమే అనేక రెట్లు ఎక్కువగా ఉంటుందని ఆ శాఖ సిబ్బందే చెబుతుండడం గమనార్హం. రెవెన్యూలో పలువురు తహసీల్దార్లు, వీఆర్వోలు, సిబ్బంది కార్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో లంచాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో కొన్ని మండలాల తహసీల్దార్లు, సిబ్బంది తరచూ లంచాలు తీసుకుంటూ ప్రజలను వేధిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. పోలీసుస్టేషన్లు, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్ కార్యాలయాల్లో కొంతమంది అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

గతంలో ఏసీబీ దాడులు

• నెల్లూరులోని రంగనాథస్వామి ఆలయంలో సిబ్బంది అవినీతి వ్యవహారంపై ఏసీబీ అధికారులు దాడులు చేసి రూ.13 కోట్ల అవినీతిని బయటపెట్టారు.
• గత నెలలో కొడవలూరు మండలం ఎల్లాయపాళెంలో పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
• కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతూ సబ్ రిజిస్ట్రార్ ఏసీబీ అధికారులు చిక్కాడు.
• 2016లో దుత్తలూరులో ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న కుర్దిస్‌బాషా అవినీతికి పాల్పడుతూ ఏసీబీ అధికారులకు చిక్కాడు.

ప్రజల సహకారం అవసరం

అవినీతికి పాల్పడుతున్న అధికారులు, సిబ్బంది భరతం పట్టేందుకు ప్రజల సహకారం అవసరం. లంచం అడిగితే ఏసీబీ అధికారులను సంప్రదించాలి. జిల్లాలో అనేక ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. అయితే బాధితులు ముందుకురావాలి. మేము అవినీతికి పాల్పడే వారిపై నిత్యం నిఘా పెడుతున్నాం.

– వీఆర్‌ఆర్ మోహన్, ఏసీబీ డీఎస్పీ

ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ, మరో ఇద్దరు



ఏసీబీ అధికారులను ఆశ్రయించిన రైతు దివి నరసింహారావు



లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏఈ చంద్రశేఖర్, అశోక్‌కుమార్, సాంబశివరావు

• విద్యుత్ కనెక్షన్ కోసం నగదు డిమాండ్
• ఏసీబీ అధికారులను ఆశ్రయించిన రైతు
• రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

జలదంకి: మండలంలో ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈతోపాటు మరో ఇద్దరు ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డారు. ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ చంద్రశేఖర్, తిమ్మసముద్రం సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ వాకా అశోక్‌కుమార్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఎస్.సాంబశివరావు తిమ్మసముద్రానికి చెందిన రైతు వద్ద రూ.20 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయారు. రైతు దివి నరసింహారావుకు తిమ్మసముద్రం గ్రామంలో 1.26 ఎకరాల మెట్ట భూమి ఉంది. ఆ పొలంలో బోరు వేసుకున్నాడు. దానికి విద్యుత్ కనెక్షన్ కోసం మీ–సేవ ద్వారా దరఖాస్తు చేసుకుని జలదంకి మండల ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ చంద్రశేఖర్ వద్దకు వచ్చాడు. చంద్రశేఖర్‌తోపాటు అశోక్‌కుమార్, సాంబశివరావు మాకు తెలియకుండా మీ–సేవలో ఎందుకు దరఖాస్తు చేశావని ప్రశ్నిస్తూ.. రూ.30 వేలు ఇస్తేనే కనెక్షన్ ఇస్తామని తెలిపారు. దీంతో రైతు వారు అడిగిన రూ.30 వేలకు బదులు రూ.20 వేలు ఇస్తానని ఒప్పుకున్నాడు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేక నెల్లూరు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. నెల్లూరు ఏసీబీ డీఎస్పీ వీఆర్‌ఆర్ మోహన్, సీఐలు శ్రీనివాస్, విజయ్‌కుమార్, కిరణ్, ఆంజనేయరెడ్డి, సిబ్బంది మంగళవారం జలదంకికి చేరుకున్నారు. వలపన్ని ట్రాన్స్‌కో కార్యాలయంలో లంచం తీసుకుంటున్న ముగ్గురినీ పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై సూచనలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

• కలెక్టర్ హరినారాయణన్

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం సందర్శించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, స్పాట్ సర్వే కౌంటర్, రిజిస్ట్రేషన్, కేస్ షీట్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్స్, ఓపీ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యపరీక్షలు చేసుకునేందుకు వచ్చిన గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించి ప్రజలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఆరు నెలలకోసారి గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి కొనసాగింపుగా మంగళవారం నుంచి 2వ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 17 గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారానికి రెండుసార్లు ఈ వైద్యశిబిరాలను నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, తహసీల్దార్ సుధీర్, సచివాలయ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మినగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

తొలుత బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేసి విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. సుమారు 30 శాతానికి పైగా విద్యార్థులు పాఠశాలకు హాజరుకాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అందజేసిన ట్యాబ్స్ పనిచేస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ గంగాభవాని, తహసీల్దార్ సుధీర్, ఎంఈఓ పి.వెంకటరత్నం, హెచ్‌ఎం రవీంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

6న ముత్తుకూరులో సామాజిక సాధికార బస్సు యాత్ర

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో గత నవంబర్ నెలలో జరగాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్ర ఈ నెల 6వ తేదీన సాయంత్రం ముత్తుకూరులో జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ యాత్రలో భాగంగా స్థానిక బస్టాండ్ కూడలిలో నిర్వహించే బహిరంగసభలో పలువురు మంత్రులు, ముఖ్యనాయకులు పాల్గొంటారని తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిందని తెలిపారు. అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ వంటి ఎందరో ప్రముఖుల ఆశయాలకు అనుగుణంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సామాజిక సాధికారత వెల్లివిరిసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించేందుకు ఈ యాత్ర జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, పోలిరెడ్డి చిన్నపరెడ్డి, కె.లక్ష్మణరెడ్డి, నడవడి ముత్యంగౌడ్, ఆలపాక శ్రీనివాసులు పాల్గొన్నారు.

‘జన్ భగీదరి’ని పటిష్టంగా నిర్వహించండి

నెల్లూరు(దర్గామిట్ట): ‘జన్ భగీదరి’ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ‘జన్ భగీదరి’ కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన్ భగీదరి కార్యక్రమంపై జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు దృష్టి సారించి ప్రణాళికాబద్ధంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విద్యార్థులను తీసుకెళ్లేటప్పుడు వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఈ నెల 8వ తేదీన అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేయించి రంగులు వేసి పూలదండలు వేయాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని తెలిపారు. రాజ్యాంగ పీఠికకు సంబంధించి ప్రతిజ్ఞ చేయాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, చర్చాగోష్టి పోటీలు నిర్వహించాలని తెలిపారు. 9న సభలు నిర్వహించి వక్తలతో ఉపన్యాసాలు చేయించాలన్నారు. ఫ్లెక్సీలపై సిగ్నేచర్ క్యాంపెయినింగ్ చేయాలని తెలిపారు. 10న డివిజన్, జిల్లాస్థాయిలో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని, 11వ తేదీన 12–15, 16–18 వయస్సు గ్రూపుల వారికి జిల్లాస్థాయిలో బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర, సామాజిక న్యాయం అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే అంబేడ్కర్ సేవలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. 12న మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో మానవహారం ఏర్పాటు చేయాలని, 19న జిల్లా స్థాయి కార్యక్రమం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. అధికారులందరూ కలిసి ఈ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

• తన భూమిలోకి వెళ్లనివ్వడం లేదని ఆవేదన
• సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం



బాధిత రైతు సమస్య తెలుసుకుంటున్న డీఆర్‌ఓ లవన్న

నెల్లూరు(దర్గామిట్ట): తన భూమిలోకి తనను రానివ్వకుండా కొందరు అడ్డుకుంటున్నారంటూ జలదంకి మండలం మద్దూరుపాడు గ్రామానికి చెందిన రైతు వెంకట రామయ్య మంగళవారం నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే స్థానికులు గమనించి అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్ పూర్తి వివరాలు తీసుకోవాలంటూ జిల్లా రెవెన్యూ అధికారి లవన్నను ఆదేశించడంతో ఆయన రైతు వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మద్దూరుపాడు గ్రామానికి చెందిన రైతు వెంకట రామయ్య తన భూమిలోకి తనను కొంతమంది రానివ్వడం లేదని, మండలస్థాయి అధికారులకు చెప్పినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని, దీంతో ఏం చేయాలో దిక్కుతోచక ఆవేదనతో కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించానని తెలిపారు. డీఆర్‌ఓ అతని సమస్యలు తెలుసుకుని సమగ్ర నివేదిక ఇవ్వాలని జలదంకి తహసీల్దార్‌ను ఆదేశించారు. కావలి ఆర్డీఓ, డీఎస్పీలతో మాట్లాడారు. రైతును భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ లవన్న ఆర్డీఓను ఆదేశించారు.

క్లుప్తంగా

ముగిసిన నెల్లూరు జోన్ క్రికెట్ పోటీలు


ట్రోఫీ అందజేస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం: మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వేదికగా రెండురోజులుగా జరుగుతున్న నెల్లూరు జోన్ అంతర కళాశాలల క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల మొదటి స్థానంలో, వీఎస్‌యూ కళాశాల రెండో స్థానంలో నిలిచాయి. వీసీ జీఎం సుందరవల్లి ట్రోఫీలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కె.సునీత, టోర్నమెంట్ పరిశీలకులు డాక్టర్ పి.ప్రసాద్‌రెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


సంతోష్ మృతదేహం

ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన రావి సంతోష్ (23) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గంగపట్నం వాగుకాలువ సమీపంలో ఉన్న శ్మశానంలో మంగళవారం ఓ వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. కోవూరు సీఐ శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై వీరేంద్రబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని సంతోష్‌గా గుర్తించారు. ఘటనా స్థలంలో గుళికల డబ్బా ఉంది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాగా నూతన సంవత్సరం సందర్భంగా జరిగిన వేడుకల్లో స్థానికులతో గొడవపడిన సంతోష్ అప్పటి నుంచి కనిపించలేదు. మద్యం మత్తులో అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. లేదా ఇతర కారణం ఏదైనా ఉందా? అని పోలీసులు విచారిస్తున్నారు. సంతోష్ మృతితో నరసాపురం ఎస్టీ కాలనీలో విషాదం నెలకొంది.

రూ.10.71 కోట్ల మద్యం విక్రయాలు

నెల్లూరు(క్రైమ్): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రూ.10.71 కోట్ల మద్యం విక్రయాలు సాగాయి. గతేడాది డిసెంబర్ 31వ తేదీన రూ.6.34 కోట్లు, ఈనెల ఒకటో తేదీన రూ.4.37 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారులు మంగళవారం తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రత్యేక దృష్టి

• డాక్టర్ పద్మావతి


మాట్లాడుతున్న పద్మావతి

నెల్లూరు సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతపై ప్రత్యేక దృష్టి సారించాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ పద్మావతి తెలిపారు. నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడత విజయవంతంగా చేశారని తెలిపారు. ఈ స్ఫూర్తితో రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధి సర్వేను పక్కాగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఎల్ఏటీఓ డాక్టర్ ఖాదర్‌వలీ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ పాల్గొన్నారు.

• పద్మావతి జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను పరిశీలించారు. స్పెషలిస్ట్ డాక్టర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు.

ఓటర్ల జాబితా తయారీపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు(దర్గామిట్ట): ఓటర్ల జాబితా తయారీపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జాబితాలో ఫొటో మార్పులు, వివరాల తప్పులను సరిచేయాలన్నారు. ఎన్నికల అధికారులందరూ తమ పరిధిలోని సెక్టార్ ఆఫీసర్లతో కలిసి ప్రతి పోలింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ర్యాంప్‌లు, తాగునీటి వసతి, విద్యుత్, మరుగుదొడ్లు మొదలైన కనీస సౌకర్యాల వివరాలను ఈఆర్వో యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అందరూ విధులు నిర్వహించాలని చెప్పారు. ఓటర్ల జాబితా తయారీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు.


జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


పరుగు పందెంలో..


ఫుట్‌బాల్ ఆడుతూ..


లాంగ్ జంప్ చేస్తున్న మహిళా పోలీస్


వాలీబాల్ ఆడుతున్న పోలీసులు


షాట్‌పుట్ పోటీ


క్రికెట్ మ్యాచ్‌లో రన్స్ తీస్తూ..


బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో వారు ఎంతో కష్టపడి పనిచేస్తుంటారు. వారు పనిఒత్తిడి నుంచి బయటపడి ఉల్లాసంగా గడిపేందుకు వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ రూపంలో అవకాశం దొరికింది. మూడురోజులపాటు ఈ మీట్ జరుగుతుంది. మంగళవారం ప్రారంభమైన క్రీడా పోటీల్లో పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/నెల్లూరు(క్రైమ్)

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి
• వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం

నెల్లూరు(క్రైమ్): క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను మంగళవారం ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పావురాలను బెలూన్లను గాల్లోకి వదిలారు. స్పోర్ట్స్ టార్చ్‌ను వెలిగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీంతో మానసిక ప్రశాంతతోపాటు చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. రోజూ వ్యాయామం, క్రీడా సాధనకు సమయం కేటాయించాలన్నారు. సోదర భావంతో, ఆరోగ్యవంతమైన పోటీతత్వంతో, గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో పాల్గొని క్రీడా స్ఫూర్తితో ముందుకుసాగాలని సూచించారు. అనంతరం ఎస్పీ తోటి అధికారులు, సిబ్బందితో క్రికెట్ ఆడారు. బ్యాటింగ్ చేసి.. బౌలింగ్ వేసి అందరిలో ఉత్సాహం నింపారు. నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్‌డివిజన్లతోపాటు ఏఆర్, హోంగార్డ్స్ విభాగ పోలీసు అధికారులు, సిబ్బంది 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 4 x 100 మీటర్ల రిలే పరుగు పందేలు, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, షాట్‌పుట్, డిస్కత్రో, లాంగ్ జంప్, హైజంప్, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నిస్, క్యారమ్స్, క్రికెట్ తదితర పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, కోటారెడ్డి, రమణ, శిరీష, గాంధీ, చంద్రమోహన్, ట్రైనీ డీఎస్పీ హేమలత, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణా.. మీరే పోటీ చేస్తారని చెప్పగలరా?

• నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్


పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'నారాయణా.. మీకు ధైర్యం ఉంటే ప్రెస్‌మీట్ పెట్టి జనసేన నాయకుడు మనుక్రాంత్‌రెడ్డి అభ్యర్థి కాదు.. నేనే పోటీ చేస్తానని చెప్పగలరా..?' అంటూ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ ప్రశ్నించారు. నెల్లూరు నగరంలోని 42వ డివిజన్ కోటమిట్ట అమీన్ నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన మున్సిపల్ పార్కును ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అనంతరం మన్సూర్‌నగర్‌లో రూ.14 లక్షలతో డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణ రెండురోజుల క్రితం అనిల్‌కు దమ్ముంటే నెల్లూరు నుంచి పోటీ చేయాలని అన్నారన్నారు. తాను నగరం నుంచే పోటీ చేస్తానని, ఆయన్ను ఓడించడం ఖాయమన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల నుంచి రూ.వందల కోట్లు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్న చరిత్ర ఆయనదన్నారు. టికెట్ కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్న వ్యక్తి తనను విమర్శించడం సిగ్గు చేటన్నారు. అనిల్ వేరే ప్రాంతాల నుంచి పోటీ చేస్తాడని పుకార్లు తెస్తున్నారంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సుల వల్ల తాను గట్టివాడిననే విషయం నారాయణ ఒప్పుకుంటున్నట్లు ఉన్నారన్నారు. డబ్బుందనే అహంకారం, ఏదైనా చేయగలను అనుకుంటున్న ఆయనకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. నారాయణను నమ్మి నిలబడే నాయకులు, కార్యకర్తలు టీడీపీలో లేరని, అందువల్లే ఎన్ టీం పేరుతో జీతాలిచ్చి సొంత సిబ్బందిని ఎన్నికల పనుల్లో తిప్పుతున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ షేక్ కరిముల్లా, నాయకులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.29
సన్నవి	: రూ.20
పండు	: రూ.7

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 115
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 153

రూ.23 కోట్లతో రహదారుల అభివృద్ధి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గంలో సుమారు రూ.23 కోట్లతో రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రూ.3.2 కోట్లతో తాళ్లపాళెం రోడ్డు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని కావలి రూరల్, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ.23 కోట్ల మేర ఏఎంసీ నుంచి నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెంచుగానిపాళెం రోడ్డు, సిరిపురం నుంచి చలంచర్ల వెళ్లే రోడ్డు, హైవే నుంచి చెన్నాయపాళెం వెళ్లే రోడ్డు, రుద్రుకోట రోడ్డుకు కూడా నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. అదే విధంగా తుమ్మలపెంట రోడ్డు విషయాన్ని కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పనులు త్వరితగతిన ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఏదైనా కారణాలతో జాప్యం జరిగితే తాత్కాలికంగా మరమ్మతులు చేయించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, తాళ్లపాళెం సర్పంచ్ సురేష్, ఆముదాలదిన్నె సర్పంచ్ బ్రహ్మానందం, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరి హత్య కేసులో నిందితుల అరెస్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

ఆత్మకూరు: భూ వివాదం నేపథ్యంలో బంధువులను ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన వ్యక్తిని, అతడికి సహకరించిన మరో ఇద్దరు కుటుంబసభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి పట్టణంలోని సీఐ కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. మర్రిపాడు మండలం భీమవరం గ్రామంలో మందా రామరత్నారెడ్డి (66), అతడికి సోదరుడు వరుసయ్యే మందా రఘురామిరెడ్డి కుటుంబాల మధ్య భూ వివాదం ఉంది. ఉమ్మడి కుటుంబాలకు చెందిన 2.16 ఎకరాల విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 28వ తేదీ ఆ భూమిని పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. సదరు భూమిలో రామరత్నారెడ్డి దున్ని సాగు చేస్తున్నాడని రఘురామిరెడ్డి అధికారులకు చెప్పాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో అధికారులు వెళ్లిపోయారు. రామరత్నారెడ్డి కొట్టడంతో రఘురామిరెడ్డి భార్య సునీత కింద పడిపోయింది. కోపోద్రిక్తుడైన రఘురామిరెడ్డి పక్కనే కేజ్ వీల్స్ (ఇనుప చక్రాలు) తగిలించి ఉన్న ట్రాక్టర్‌తో రామరత్నారెడ్డిని గుద్ది అతడిపైకి ఎక్కించాడు. అడ్డొచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ మూలి శ్రీనివాసులు (48) పైనుంచి వాహనాన్ని పోనిచ్చాడు. సమాచారం అందుకున్న ఎస్సై విశ్వనాథరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాల పాలైన రామరత్నారెడ్డి, ఆయన కుమారులు రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డిని తన వాహనంలో ఆత్మకూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. దారిలోనే రామరత్నారెడ్డి మృతిచెందాడు. కోటారెడ్డి, సీఐ జి.వేణు ఆధ్వర్యంలో కేసు ముమ్మరంగా దర్యాప్తు చేసి నిందితులైన రఘురామిరెడ్డి, అతడి భార్య సునీత, వదిన మందా లక్ష్మిని ఏఎస్‌పేట అడ్డరోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. తక్కువ సమయంలోనే కేసును ఛేదించిన సీఐ, ఎస్సైలను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అభినందించారు.